మినీ రిజర్వాయర్లో ప్రమాదవశాత్తు జారిపడి గిరిజనుడి మృతి

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: మండలంలోని కొర్రాయిలో కాలకృత్యాలకెళ్లి ప్రమాదవశాత్తు మినీ రిజర్వాయర్లో జారిపడి గిరిజనుడి మృతి చెందిన సంఘటన .దీనికి సంబంధించి వివరాలు కొర్రాయి గ్రామానికి చెందిన పంచాడి వెంకటరావు(44) అనే గిరిజనుడు ఉదయం ఏడు గంటలకు సమయంలో గ్రామ సమీపానగల మినీ రిజర్వాయర్ గట్టులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు రిజర్వాయర్లో మునిగిపోయి గల్లంతయ్యారు. స్థానికుల సాయంతో గాలించిన మృతదేహం ఆచూకి లభించలేదు. ఆ పంచాయతీ సర్పంచి కొములు, బాధిత కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మృతదేహన్ని వెలికి తీశారు. మృతదేహన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. శవపంచానామ నిర్వహించి బాధిత కుటుంబీకులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై పాపినాయుడు తెలిపారు.

మాతృ మరణాలు జరిగితే ఉపేక్షించను : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : మాతృ మరణాలు జరగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. మాతా శిశు మరణాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడి ఎస్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగాల నుండి తొలగిస్తానని హెచ్చరించారు. జర్రెల, దవునూరు, గెమ్మిలి, దుంబ్రిగుడ, ఆర్ వి నగర్, దారకొండ, ఉప్ప ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మాతృ మరణాలపై పి.హెచ్.సి వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భవతులను, గర్భవతులను ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా బర్త్ వెయిటింగ్ హాలులో చేర్పించి సుఖ ప్రసవం జరిగేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆశాలు, అంగన్వాడీలు, ఎ.ఎన్.ఎంలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గర్భవతులు మరణాలకు గల కారణాలు, అందించిన వైద్య సేవలు, వైద్య పరీక్షలు, వ్యాది నిర్ధారణలను అడిగి తెలుసు కున్నారు. ఉప్ప పి.హెచ్.సి పరిధిలోని మరణాలపై సమీక్షి స్తూ సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనుపత్రి ప్రసవాలు పెరగడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గర్భవతులు ఆసుపత్రిలో చేరడానికి నిరాకరించినపుడు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఐసిడి ఎస్ సిబ్బందికి సమాచారం అందిస్తే సకాలంలో స్పందించాలని ఆదేశించారు. సమాచారం అందించినా స్పందించకపోతే తన దృష్టికి తీసుకుని వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

దుంబ్రిగూడలో పొగరాని పొయ్యిలు పంపిణీ

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మండల కేంద్రం దుంబ్రిగుడ గ్రామంలో క్రాప్ జోన్ ఎగ్రో పారేస్ట్ సంస్థ ప్రతినిధులు పొగరాని పొయ్యిలను గిరిజన కుటుంబాలకు పంపిణీ చేశారు. ఆ సంస్థ డివిజనల్ కో-ఆర్డినేటర్ రాంనాయుడు, మండల కో-ఆర్డినేటర్ గోపినాథ్ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 10వేల గిరిజన కుటుంబాలకు ఉచితంగా పొయ్యిలను పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. పొగరాని పొయ్యిలతో కాలుష్య నియంత్రణతోపాటు శ్వాశకోస వ్యాధులు దరి చేరకుండా దోహదపడుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ పీల్డ్ అసిస్టెంట్లు శెట్టి.చంద్రదాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి సార్...

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని కొల్లూరు గ్రామంలో రెవిన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ రెవిన్యూ సదస్సులో పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతలైన కొల్లూరు, గొందూరు పోచవరం గ్రామ ప్రజలు ప్రభుత్వం కల్పించిన పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు సరైనవిగా లేవని, నీరు, విద్యుత్తు, విద్యాలయాలు, స్మశాన వాటికలు వంటివి ఏర్పాటు చేయాలని అక్కడ ప్రజలు కోరారు. పునరావాస కాలనీలో కల్పించిన వ్యవసాయ భూములు పంటలు పండించడానికి అనుకూలంగా లేవని, పోడు భూములకు, భూమికి భూమి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుపై దాడి చేసిన గిరిజనేతర భూస్వామి నగేష్‌ను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-హుకుంపేట: అనంతగిరి మండలంలో గిరిజన సంఘం మండల నాయకులు జేష్ఠ వెంకటరమణ, ఆర్ శ్రీనుపై దాడి చేసిన గిరిజనేతర భూస్వామి బి.నగేష్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకురాలు సొంటేన హైమావతి, వైస్ ఎంపీపీ ఎస్ కొండలరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలం కేంద్రం లో వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అనంతగిరి మండలం భీంపోలు పంచాయితీ సర్యపల్లి రెవిన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 66లో 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్భ మిని విటోరియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని బి.నగేష్ ఈనెల 3 తేదీన ఆక్రమించి చదును చేస్తుండగా రెవిన్యూ అధికారులకు పిర్యాదు చేసినందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడి గిరిజన సంఘం నాయకులపై గుండాలతో రాత్రి సమయంలో దాడి చేసిన శ్రీను పై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి ఆక్రమిం చిన గిరిజనేతర భూ స్వామిపై 2024 లాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి ఆక్రమించిన భూములు వెంటనే ప్రభుత్వం స్వాధీనం పరచుకో వాలన్నారు. గిరిజనులు తరతరా లుగా సాగుచేస్తున్న భూములను మైదానవాసులు ఆక్రమించి దౌర్జన్యం చేస్తూ భౌతికంగా దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాని వారు కోరారు, అలాగే ప్రభుత్వ భూములను కబ్జా చేసి స్థానికంగా ఉన్న గిరిజనులపై భౌతిక దాడి హత్యాయత్నం చేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి, మెరక చింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్ రావు, కొండలరావు, తడిగిరి,కొంతిలి వైస్ సర్పంచ్‌లు కిల్లో రామారావు,దూరు కృష్ణమూర్తి, నాయకులు గెమ్మేలి ఆనంద్, కొర్ర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

అక్రమాలపై ప్రశ్నించిన గిరిజన నాయకుడు వెంకటరమణకు జరిగిన దాడి ఖండించండి
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్

విశాలాంధ్ర-అరకులోయ : అనంతగిరి మండలం గిరిజన నాయకుడు జేష్ఠ వెంకటరమణపై గిరిజనేతర భూస్వామి బీ.నగేష్ దాడి చేయడం అత్యంత హేమమైన చర్య అని భూస్వామి బి నగేష్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. భూస్వామి దాడిలో గాయపడి అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మండల నాయకులు కిల్లో జగన్నాథం కె సహదేవ్ లతో కలిసి పరామర్శించారు. జిల్లా ప్రధాన కార్య దర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి కబ్జా చేసి ప్రశ్నించిన గిరిజన నాయకుడుపై దాడి చేసిన వారిపై తక్షణమే అరెస్టు చెయ్యాలని 13 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జా చేసిన విటోరి రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని కబ్జా చేశారని అనంతగిరి మండలం భింపోలు పంచాయితీ సర్యపల్లి రెవిన్యూ పరిదికి చెందిన సర్వే నవంబర్ - 66 లో 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని విటోరి రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని జనవరి 3 తేదిన ఆక్రమించి సదును చేస్తుండగా రెవిన్యూ అధికారులకు పిర్యాదు చేసినందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడి గిరిజన నాయకులైన జేష్ఠ వెంకటరమణ ఆర్,శ్రీను పై గుండాలతో రాత్రి దాడి చేసి గాయ పర్చారని తక్షణమే వెటోరి రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని బి.నగేష్‌పై ఏస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు. 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి ఆక్రమించిన గిరిజ నేతర భూస్వామిపై లాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చెయ్యాలని ఆదివాసులు తరతరాలుగా సాగు చేస్తున్న భూములను మైదానవాసులు అక్రమంగా ఆక్రమించి దౌర్జన్యం చేస్తూ భౌతికంగా దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసులకు రక్షణ లేదని నాన్ షెడ్యూల్ ఏరియని షెడ్యూల్ ప్రాంతంలో కలిపితే ఆదివాసీల భూములు,అడవులు రక్షణ కల్పించాలని గిరిజనులపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం అపహరణ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని రేఖపల్లి నందు శ్రీకోట మైసమ్మ తల్లి ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం మంగళవారం తెల్లవారుజామున దొంగలు విగ్రహాన్ని అపహరించారు. ఇదే గుడిలో గత నెల నాగబంధం విగ్రహం దొంగిలించడం జరిగిందని, వడ్డెగూడెం గ్రామములో వెలసి ఉన్న శ్రీసతీ పార్వతి రుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలను దొంగిలించారని, మండలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు ఆరోపించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసి హిందువులను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని లేనిచో తీవ్ర ఆగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ దొంగతనాలపై సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు, హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల రామారావు, బోర్రా కామేశ్వరి, దుర్గాప్రసాద్, ఐ.వి.వి. ప్రసాద్, బి.రాజు నాగేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

32 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-జిమాదుగుల : మండల కేంద్రం సమీపంలో గల కొత్తూరు జంక్షన్ వద్ద మంగళవారం స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా జిమాదుగుల నుండి పాదేరు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గోనెసంచులో నింపిన 32 కిలోల ఎండు గంజాయి లభ్యమైందని స్థానిక సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి నిందితులిద్దరిని అదుపులోకి తీసుకొని పెదబయలు మండలం వేల్లపాలెం గ్రామానికి చెందిన కిల్లో సుబ్బారావు, అలాగే అదే గ్రామానికి చెందిన కిల్లో జ్యోతిగా గుర్తించారు. గంజాయిని మరియు ద్విచక్ర వాహనాన్ని నిందితులిద్దర్నీ అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ చేపట్టిన ఆర్డీఓ

విశాలాంధ్ర-అడ్డతీగల : రంపచోడవరం డివిజన్ అడ్డతీగల శివారులో మంగళవారం వాహనాల తనిఖీ ఆర్డీఓ శ్రీనివాస కుమార్ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారుల నుంచి రూ 70వేలు అపరాధ రుసుం వసూలు చేశారని మీడియా కు ఇచ్చిన సమాచారం లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు అన్నిరకాల రికార్డులు దగ్గర పెట్టుకోవాలని సూచించారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు మారేడుమిల్లి, రంపచోడవరం, ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం. 7989138129, 7386603589

100 రోజుల్లో 100 సీసీ రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమం

- దోలిమోతులకు స్వస్తి గిరి గ్రామాలను అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణం
- 63 అంగన్వాడీ పోస్టుల భర్తీకి శ్రీకారం
- మంత్రి గుమ్మడి సంధ్యారాణికి పూలతో స్వాగతం పలికిన గ్రామస్తులు

విశాలాంధ్ర-పాచిపెంట : 100 రోజుల్లో 100 సిసి రోడ్లు నిర్మాణం కార్యక్రమానికి హాజరైన మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంచాడ వలస గిరిజన గ్రామ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. మండల కేంద్రమైన పాచిపెంటలో అతిపెద్ద గిరిజన పంచాయితీ మంచాడవలస గ్రామంలో శ్రీకారం చుట్టిన స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన శాఖా మాత్యులు శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి గిరిజనుల నుండి ఘనస్వాగతం లభించింది గత ప్రభుత్వం జగన్ పాలనపై నిప్పుల వర్షం కురిపించారు. గత ప్రభుత్వంలో గుంతలలో రోడ్లు చూసాం. కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ 10 కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు .పనులు మొదలుపెట్టి 100 రోజులలో 100 రహదారులు పైచిలుకు పూర్తి చేసుకోవడం అందుకు అధికారులు తమ వంతుగా పనిచేసీ రోడ్లు నిర్మాణాల పూర్తి చేశారని అన్నారు. రాష్ట్రంలో ప్రతీ గ్రామానికీ రహదారి సౌకర్యం కల్పించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు కంకణం కట్టుకున్నారు. సాలూరు నియోజకవర్గంలో 100 సీసీ రోడ్లలో 5 కోట్ల వ్యయంతో పాచిపెంట మండలంలో 27, మెంటాడ మండలంలో 20, మక్కువ మండలంలో 35, సాలూరు మండలంలో 22 నాణ్యమైన సీసీ రోడ్లు పూర్తిచేసుకున్నాం అని మంత్రి సంధ్యారాణి అన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారులు నిర్మించి డోలీ మోతలు లేకుండా చేస్తాం అని మంత్రి అన్నారు.గిరిజన గ్రామాల్లో ఎక్కడా కూడా త్రాగునీరు, రోడ్లు సమస్య లేకుండా ఏడాదిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉగాది నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం జరుగుతుందని తెలిపారు.త్వరలోనే జిల్లాలో 63 అంగన్వాడీ ఉద్యోగాలు భర్తీకి శ్రీకారం చుట్టామని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు వైసిపి నేతలు అభివృద్ధికి అడ్డుపడితే సహించే ప్రసక్తి లేదని మంత్రి గాటుగా స్పందించారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు ట్రై రుణాలు అందించి, జీవనాధారం కల్పించి గిరిజనులకు అవసరమైన సదుపాయాలు సమకూరుస్తా మని అన్నారు.గత ప్రభుత్వం గిరిజనులకు ఉపయోగపడే 18 రకాల పదకాలు రద్దు చేసిందన్నారు. అభివృద్ధి అంటే కోటను ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. అడిగిన వెంటనే సాలూరు నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కి మంత్రి సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ప్రసాద్ బాబు టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ పాంచాలి సర్పంచ్ యుగంధర్ నాయకులు కనకారావు సురేష్ ఎంపిటిసి ఉమామహేశ్వరరావు మిర్తి వలస సర్పంచ్ ప్రతినిధి పోల్ నాయుడు నరసింగ రావు పాలూరు ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

పీసా ఎన్నికల్లో 275 గ్రామాల్లో ఏకగ్రీవం

ఐటిడిఎ పీఓ అసుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో జరిగిన పీసా ఎన్నికల్లో 278 గ్రామాలకు గాను 275 గ్రామాల్లో ఏకగ్రీవం అయినట్లు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అసుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. సోమవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన జారీచేశారు. ఐటిడిఎ పరిధిలోని ఎనిమిది పీసా మండలాలలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు 277 పీసా గ్రామాలలో ఉపాధ్యక్షులు, కార్యదర్శిలకు ఎన్నికలు జరగగా 275 గ్రామాల యందు ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. 2 గ్రామాలలో పీసా ఎన్నికలు జరిగినట్లు పిఓ వివరించారు.

రీసర్వేపై నిమ్మగడ్డలో అవగాహన ర్యాలీ

డిప్యూటీ తహసిల్దార్ అప్పన్న

విశాలాంధ్ర-కొయ్యూరు : గ్రామాల్లో ప్రజలందరికీ రీసర్వేపై అవగాహన కల్పించేందుకే ర్యాలీలు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని మండల రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ అప్పన్న అన్నారు. మంగళవారం కొయ్యూరు మండలం శరభన్నపాలెం పంచాయతీ పరిధిలో గల నిమ్మగడ్డ గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిటి అప్పన్న మాట్లాడుతూ గ్రామాల్లో భూములను రీ సర్వే చేసేటప్పుడు వాటి యజమానులు దగ్గరుండి రీ సర్వే చేయించుకోవాలని తెలిపారు. గ్రామాల్లోకి వచ్చే రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన సందర్భంగా తెలియజేశారు.. ముందుగా గ్రామంలో అన్ని వీధుల్లోనూ తిరుగుతూ తెలుసుకుందాం రీ సర్వే కోసం, సహకరిద్దాం రీ సర్వే కోసం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రెవిన్యూ అధికారులు నిమ్మగడ్డ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజ్ఞప్తి

విశాలాంధ్ర-పాలకొండ : ఈనెల జనవరి 9 తేదీన గురువారం ఉదయం 10: 30లకు భామిని మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం జరుగుతుంది సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సమావేశానికి ఏపీ రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య హాజరవుతున్నారు అని వెల్లడించారు ఈ సమావేశంలో ప్రధానంగా జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలు,వనరులు ఉన్న పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతాంగం నిరంతరం వర్షాల మీద ఆధారపడి పంటలు పండించుకోవలసిన దినస్థితికి నెట్టబడుతున్నాయని అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు రైతులు ఎదుర్కొన్న సమస్యలు, అలాగే కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఈ సమావేశంలో చర్చించుట పరిష్కారానికి కార్యాచరణ రూపొందించుకోవడానికి ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.రైతులను ఐక్యం చేస్తూ సమస్యల పరిష్కారం వైపు నడిపిస్తున్న సంఘ నిర్మాణం,భవిష్యత్ కార్యాచరణకై భామినిలో రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో భామిని మండల ప్రధాన సమస్యలను చర్చించి తదుపరి కార్యక్రమాన్ని తీసుకోవటానికి మండల పెద్దలు,రైతు శ్రేయోభిలాషుల సూచనలు సలహాలును పరిగణలోకి తీసుకొని తదుపరి కార్యాచరణ జరుపుటకు ఈ సమావేశం ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నది. ప్రస్తుతం మండలంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం కొద్దిరోజులు అవుతున్న రైతులకు ఎంతో ఆసరాగా ఉందని చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికీ మండలం లో పత్తి రైతులకు ఎంత ఆస్రగా ఉందని తెలిపారు.రాజకీయాలకు అతీతంగా జనవరి 9నజరిగే జిల్లా విస్తృత సమాసంను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో,బాగాపురం అప్పలనాయుడు,గురుబిల్లి వెంకట లక్ష్మీపతి నాయుడు, కార్యదర్శి కొత్తకోట బాబురావు నాయుడు,బిడ్డిక ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పలగర ఎంపీపీ, ఎంఈఓ-1లు పాఠశాలను ఆకస్మిక సందర్శన

విశాలాంధ్ర-బలిజిపేట : మండలం పలగర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి 1 సామల సింహాచలం మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులు తెలుగు ఆంగ్లం భాషలను ధారాళంగా చదివేలా తీర్చి దిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మంచి నీరు, టాయిలెట్స్ సౌకర్యాలను పరిశీలించారు. శుద్ధ జల యంత్రాలను తప్పక వినియోగించాలని, ఏమైనా మరమ్మతులు ఉంటే సంభందిత మెకానిక్ కు తెలియజేయాలన్నారు. అనంతరం టీచర్ల డైరీలను, లెసన్ ప్లాన్స్ ను తనిఖీ చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఎస్ఏ-1 మార్కులను మార్క్స్ రిజిస్టర్ లో నమోదు చేసిందీ లేనిదీ తనిఖీ చేశారు. అదేవిధంగా షూ సైజ్ ఆన్ లైన్, టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో ఉపాధ్యాయుల డేటా ఆన్ లైన్ పూర్తి చేసి ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లకు తోడ్పాటు : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం : ఐటిడిఎ పరిధిలోని (క్యాష్యూ) జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఉద్యాన రైతులకు తోడ్పాటు అందివ్వాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపప్పు మార్కెటింగ్‌లో రైతులు దళారుల బారిపడకుండా విడివికెల ద్వారా మంచి ధర కల్పించే విధంగా వ్యవసాయ, ఉద్యాన వన అధికారులు ప్రోత్సాహాన్ని అందించాలని స్పష్టం చేసారు. ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు లెమన్ గ్రాస్ సాగుచేస్తున్నది, విస్తీర్ణం అంశాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో లెమన్ గ్రాస్ పెంపకం విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరికి ప్రత్యామ్నాయంగా లెమన్ గ్రాస్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే అవకాశాలను కల్పించవచ్చన్నారు. జిల్లాలో సుమారు రెండువందల ఎకరాలలో లెమన్ గ్రాస్ సాగు చేస్తున్నట్లు అధికారులు తెలపగా శ్రీనిధి, బిసి కార్పొరేషన్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసి జిల్లాలో వేయి ఎకరాల్లో సాగు లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవకాశాలను కూడా తెలపాలన్నారు. లెమన్ సాగు ఈ క్రాప్ క్రింద ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతు పంటల సాగు ఈ క్రాప్‌లో నమోదైన పంట వివరాలను క్షేత్రస్థాయిలో ఆన్లైన్ లో వివరాలు, విస్తీర్ణ సాగు ఖచ్చితంగా ఉండేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పునః పరిశీలన చేయాలన్నారు. భామినిలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం వద్ద పత్తి రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎడి మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఐటిడిఎ పరిధిలోని గదభ, సవర గిరిజన కులాల లభిదారులకు గొర్రెలు, మేకలు యూనిట్ల కొనుకోలుకు రుణాలు మంజూరు చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. నీతి ఆయోగ్ ఆశావహ జిల్లాగా ఉన్నందున అన్ని రంగాల్లో అభివృద్ధి పనుల సూచికల లక్ష్యాల సాధనకు పురోగతి స్పష్టంగా చూపాలన్నారు. మిల్లెట్ మేలాలను నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అటవీ శాఖ అధికారి జి.ఎ.పి ప్రసూన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, డ్వామా పథక సంచాలకులు కె. రామచంద్రరావు, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి వై. సత్యంనాయుడు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. ఎస్. మన్మధరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, ఐటిడిఎ ఎపిడి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

24గంటలు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

డిప్యూటీ డిఎం&హెచ్ఓ డాక్టర్ పద్మావతి

విశాలాంధ్ర-కురుపాం : ఏజెన్సీ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు 24గంటలు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎం హెచ్ ఓ డాక్టర్ కె వి ఎస్ పద్మావతి ఆదేశించారు. మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో జరుగుతున్న ఆశా డే సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిల్లలకు పూర్తి రోగ నిరోధక శక్తి, ఇమ్యునైజేషన్ షెడ్యూల్, మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డులు వాడకం, ఆర్ సి హెచ్ పోర్టల్ లో గర్భిణీ స్త్రీల నమోదు, శిశు మరణాల రేట్లు తగ్గించే విధానం, ఈ ఆశా యాప్, సర్వీస్ అప్డేట్ పర్యవేక్షణ గురించి ఆశావర్కర్ లకు అవగాహన కల్పించి ప్రతి ఒక్క ఆశా వర్కర్ తనకు కావలసిన అన్ని ప్రెగ్నెన్సీ కిట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి ప్రతిఒక్క రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ ప్రజ్ఞ, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్‌యంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే జరగాలి

విశాలాంధ్ర-బెలగాం : పక్కాగా భూముల రీ సర్వే చేపట్టాలని సబ్ కలెక్టర్ మరియు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మంగళవారం పార్వతీపురం మండలం గోపాలపురం గ్రామంలో రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియ, వెరిఫికేషన్ సమయంలో ఉండాల్సిన పత్రాలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. సరైన పత్రాలు లేకుండా వెబ్ ల్యాండ్‌లో పేరు మార్పువద్దని సిబ్బందికి సూచించారు. రైతుల భూములన్నింటినీ రీ సర్వే చేయాలని ఆయన ఆదేశించారు. రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, స్థానికులు, రైతులు పాల్గొన్నారు.

అంధుల పాలిట ఆరాధ్య దైవం

విశాలాంధ్ర-బెలగాం : లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవమని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎండి గయాజుద్దీన్ అన్నారు. మంగళవారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా ఆర్.సి.ఎం (పాఠశాల) ప్రాంగణంలో బ్రెయిలీ చిత్ర పటానికి పూలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండి గయాజుద్దీన్ మాట్లాడుతూ బ్రెయిలీ భాషను కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఈ వేడుకలను జరుపుకోవడం జరుగుతుందన్నారు. అంధులకు ఉండే హక్కులు, వారు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో లూయిస్ తన మూడేళ్ల వయసు నుండే తన తండ్రితో కలిసి పని చేయాల్సి వచ్చిందన్నారు .ఈ సమయంలో జరిగిన ఒక ప్రమాదంలో ఒక కత్తి అతని ఒక కన్నుకు గుచ్చుకుని, అతని చూపు దెబ్బతిందన్నారు. కొద్దికాలానికి మరో కంటి చూపు కూడా పోయిందన్నారు. సరైన వైద్యం అందక లూయిస్ ఎనిమిదేళ్ల వయసులోనే పూర్తిగా చూపు కోల్పోయారని అన్నారు. చూపు లేకపోయినా చదవాలనే పట్టుదల లూయిస్ బ్రెయిలీలో బాగా పెరిగిందని, అప్పటికి ఉన్న అవకాశాలతోనే బాగా చదువుకున్నారని అన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి కె. కవిత మాట్లాడుతూ ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ప్రతీఏటా జనవరి 4న జరుపుకుంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా దృష్టి లోపంతో జీవితం గడుపుతున్న వారికి ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. లూయిస్ బ్రెయిలీ అనే మహనీయుని పుట్టినరోజు సందర్భంగా బ్రెయిలీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం అని అన్నారు. ఈయనే బ్రెయిలీ లిపిని ఆవిష్కరించారని, బ్రెయిలీ లిపి అనేది అంధులు చదవడానికి, రాయడానికి ఉపయోగించే భాష. పుట్టుకతోనో, లేదా ఇతరత్రా కారణాలతో కంటి చూపు కోల్పోయిన వారు చదువుకు దూరమవకుండా ఉండేందుకే బ్రెయిలీ లిపిని రూపొందించారని ఆమె అన్నారు. అంధత్వంతో బాధపడుతున్న వారు తమ స్వశక్తితో సమాజంలో ఇతరులతో సమానంగా నిలిచేందుకు బ్రెయిలీ లిపి దోహదపడుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా దృష్టిలోపంతో సతమతమవుతున్నవారికి లూయిస్ బ్రెయిలీ తన ఆవిష్కరణతో మార్గదర్శిగా నిలిచారని అన్నారు. లూయిస్ బ్రెయిలీ జీవించి ఉన్నప్పుడు దక్కని గౌరవం అతని మరణాంతరం దక్కిందన్నారు. ఆయన పుట్టినరోజును ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకోవడమే ఆయనకు దక్కిన అత్యున్నత గౌరవమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విసిఈఎ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, అంధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి

విశాలాంధ్ర-బెలగాం/బలిజిపేట : గ్రామీణ స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు పేర్కొన్నారు. బలిజిపేట మండలం అరసాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. శిశు ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాల్లో టీకాలు ముఖ్యమని పిల్లలకు వారి వయస్సుకు తగ్గట్టుగా సకాలంలో టీకాలు వేయాలని తద్వారా ప్రాణాంతక వ్యాధులైన పోలియో, తట్టు, క్షయ, దనుర్వాతం, న్యుమోనియా, హెపటైటిస్, డయేరియా, దృష్టి సమస్యలు, కంఠసర్పి, కోరింత దగ్గు నుండి పిల్లలకు రక్షణ ఉంటుందన్నారు. టీకా వేసిన మరియు గడువు తేదీలను ఎంసిపి కార్డులో నమోదు తప్పనిసరని సూచించారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ త్వరగా జరగాలని అందుకు ఇసి (అర్హులైన జంటలు) లను గుర్తించి పర్యవేక్షించే కార్యాచరణ ఆశాలు చేపట్టాలన్నారు. తద్వారా గర్భిణిలలో హైరిస్క్ సమస్యలను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మాతా, శిశు ఆరోగ్య మెరుగునకు పై కార్యక్రమాలపై దృష్టి సారించి సమిష్టి కృషి చేయాలన్నారు. ఎనీమియా ఏక్షన్ కమిటీలు పక్కాగా నిర్వహించి గర్భిణీ, కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సర్వేలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. కొత్తగా గుర్తించిన అనారోగ్య లక్షణాలు, దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం మెరుగు పడేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కుష్టువ్యాధి లక్షణాలను సత్వరమే గుర్తించాలని తద్వారా అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలియజేసారు. క్షయ, క్యాన్సర్ లక్షణాలను గుర్తించడంలో దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీ మరియు స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ లు ఏమేరకు పూర్తి చేయడం జరిగిందని తెలుసుకున్నారు. ఆరోగ్యరీత్యా ప్రజలు ఎటువంటి వ్యయ, ప్రయాసలు పడకుండా వారికి అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలు, నదుపాయాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమానికి సంబంధించి బ్యానర్ ను వైద్య సిబ్బందితో కలిసి పిహెచ్సీ ఆవరణలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం. శివగాయిత్రి, డిపిఎంఓ మూర్తి, సూపర్వైజర్స్ నారాయణరావు, సత్యవతి వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు వున్నారు.

సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం

సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాలపై నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆత్మ పీడీ ఆశాదేవి

విశాలాంధ్ర-చింతపల్లి : సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించి మార్కెటింగ్ చేస్తే పట్టణాలలో ఉద్యోగాలు చేసి సంపాదించే వారి కంటే అధిక ఆదాయాన్ని సంపాదించే అవకాశాలు వ్యవసాయ రంగంలో పుష్కలంగా ఉన్నాయని విశాఖపట్నం కు చెందిన ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి అన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ పథకం కింద సమేతి ఆంధ్ర ప్రదేశ్ మరియు విశాఖపట్నం ఆత్మ సహకారంతో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సేంద్రియ వ్యవసాయంపై స్థానిక సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ అళ్ల అప్పలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి విశిష్ట అతిథి గా సంజీవిని స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి దేవుళ్ళతో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో వివిధ అంశాలపై గ్రామీణ యువతకు అవగాహనతో పాటు నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఈ నైపుణ్యంతో తమ గ్రామాలకు వెళ్లిన తర్వాత సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి వాటిని ఆచరించి మంచి దిగుబడి సాధించే విధంగాను మార్కెటింగ్ సౌలభ్యం ఉండే విధంగా కృషిచేసి ఈ పద్ధతుల ద్వారా ఇతర రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని పిలుపునిచ్చారు. యువత లోని ఆసక్తిని బట్టి ఇటువంటి మరిన్ని కార్యక్రమాలను ఈ గిరిజన మండలాల్లో నిర్వహించేందుకు ఆత్మ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. చదువుకున్న గ్రామీణ యువత ఉద్యోగాల కోసం నిరీక్షించి కాలాన్ని వృధా చేయకుండా తమ తమ గ్రామాల్లోనే దేశీ విత్తనాలను వినియోగించి సేంద్రియం, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించి మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా పట్టణాల్లో ఉద్యోగం చేస్తున్న వారి కంటే అధిక ఆదాయాన్ని పొందవచ్చునని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆరు రోజులు పాటు పాల్గొన్న అతిథులు, శిక్షకులకు ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు) ప్రధానం చేశారు. ఆర్ వి నగర్ కాఫీ పరిశోధన స్థానానికి చెందిన సాయిల్ సైన్స్ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ రాజీవ్ పాటి సేంద్రీయ పద్ధతిలలో కాఫీ తోటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కే బయ్యప్ప రెడ్డి, సందీప్ నాయక్, డాక్టర్ వెంకటేష్ బాబు, జోగారావు, ఉద్యానవన పరిశోధన స్థానం అధిపతి చెట్టి బిందు, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, గ్రామీణ యువత పాల్గొన్నారు.

కోరం లేక వాయిదాపడ్డ పీసా గ్రామసభ

పార్టీల ప్రమేయంతో మూడోసారి కూడా వాయిదా

విశాలాంధ్ర-దేవీపట్నం : గిరిజన ప్రాంతంలో గిరిజనాభివృద్ధికి గ్రామాభివృద్ధికి చట్టం చేసి తమ గ్రామాలను తామే అభివృద్ధి చేసుకునేందుకు మన్యంలో ప్రభుత్వం చేపడుతున్న పీసా గ్రామసభ ఎన్నికలు రాజకీయ రంగులు పులుముకుంటున్నాయి. దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామంలో మంగళవారం జరగాల్సిన పీసా గ్రామసభ మళ్ళీ కోరం లేక వాయిదా పడ్డ విధానం పలు విమర్శలకు తావిస్తుంది.ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడ్డ ఎన్నికల వెనక రాజకీయ ప్రమేయం చోటు చేసుకుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. సర్పంచ్ కోసు లక్ష్మణ్ దొర అధ్యక్షతన నాడు జరిగిన సమావేశం ఫలితం ముందే ఊహించిమరో సారి వాయిదా తధ్యం అని చెప్పుకోవటం చూస్తుంటే దీనిపై పట్టుకు రాజకీయ పార్టీలు ఏ స్థాయిలో తమ ప్రయత్నాలకు పదును పెడుతున్నారో తేట తెల్లమౌతుంది. ఇందులో ఎన్నికల అధికారి పాత్రను పలువురు తప్పు పడుతున్నారు.అధికార పార్టీకి చెందిన నాయకులు తమ పార్టీ కి ఆ స్థానం దక్కాలని ప్రయత్నం చేస్తుండగా గ్రామస్థాయిలో నిధులు దుర్వినియోగం విషయాన్ని కప్పిపుచ్చుకొనేందుకు ఈ పదవిని ఛేజిక్కించు కోవాలని కొందరు చూస్తున్నారు.ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన మూడు పీసా గ్రామ సభ ఎన్నికలు కోరం లేదని కారణంతో దేవీపట్నం ఎలక్షన్ అధికారి వెంకటేష్ వాయిదా వేశామన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్,డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం,మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ.. మన్యం ప్రాంతంలో అనేక గ్రామ పంచాయితీలలో కోరం లేదని కారణంతో పీసా గ్రామసభ ఎలక్షన్స్ వాయిదా మీద వాయిదాలు పడుతుంటే షెడ్యూల్డ్ ప్రాంతంలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటుందన్నారు.ఈవిధంగా కొనసాగితే ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు పూర్తి అయ్యిన ఆదివాసులకు అందని ద్రాక్షగానే మారుతుందన్నారు.ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ఇందుకూరు గ్రామం మరియు సమస్యాత్మకంగా ఉన్న ప్రదేశాలలో పీసా గ్రామసభ ఎన్నికలకు బ్యాలెట్ ఓటింగ్ సిస్టం (సీక్రెట్ ఓటింగ్) ఏర్పాటు చేయడం ఉత్తమం అన్నారు.ఈ పీసా గ్రామసభ ఎన్నికలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల జోక్యం లేకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ ప్రజలు అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో యదేచ్ఛగా పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు

- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

విశాలాంధ్ర-ఎటపాక : గ్రామీణ ప్రాంతాలలో బెల్ట్ షాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. సీఎం ఆదేశించిన, ప్రభుత్వం బెదిరించిన తమకు మాత్రం ధనార్జనే ముఖ్యమనే చందంగా మద్యం వ్యాపారులు ముందుకు సాగుతున్నారు. వైన్స్‌లో దొరకని బీర్లు బెల్టు షాపుల్లో అందుబాటులో ఉంటున్నాయి. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు దాడులు చేయకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. వారి ఆదాయం కోసం గ్రామాల్లో బెల్ట్ షాపులను విచ్చలవిడిగా పెంచేసి మద్యం అమ్మకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఎటపాక మండలలో రెండు వైన్స్ షాప్‌లు ఉన్నాయి. అయితే గ్రామీణ ప్రాంతంలో కొనుగోలు దారులు అవసరాలను ఆసరాగా చేసుకొని బెల్ట్ షాపుల నిర్వహణకు తెరలేపారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మాదుగులపల్లి మండలంలో నేల్లిపాక-1, ఎటపాక ఉన్నవి. గ్రామానికి 10 నుంచి 20 చొప్పున బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మండలంలో రెండు లైసెన్స్ దుకాణాలు ఉన్నాయి. వైన్స్ షాప్‌ల నుండి నేరుగా బెల్టు షాపులకు సర ఫార అవుతుంది. దీంతో గ్రామాల్లో రోజులో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో తాగేవారి సంఖ్య పెరిగిపోయింది. బెల్టు షాపులు ఇళ్ల మధ్యలోనే ఉండడంతో మహిళలకు బయట తిరిగేందుకు ఇబ్బందిగా మారిందని ప్రజలు వాపోతున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే... మండల వ్యాప్తంగా ప్రతి నెలా బెల్ట్ షాపుల ద్వారా లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్స్ యజమానులు, ఎక్సైజ్ పోలీసు అధికారుల అండదండలతో ఉమ్మడి మండలాల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటవుతున్నాయి. మద్యం అధికంగా విక్రయించడానికి ప్రభుత్వం ఎక్సైజ్ అధికారుల ద్వారా మద్యం వ్యాపారులపై ఒత్తిడి తీసుకువస్తోందని, ఈ క్రమంలోనే మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలకు ఊరూరా బెల్ట్‌షాపులు పెట్టి అనధికారికంగా అమ్ముతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారుల దృష్టికి రావడం లేదా వచ్చిన చర్యలు తీసుకోవడం లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో అలసత్వం వద్దు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధిహామీ సిబ్బందికి వీడియో కాన్ఫిరెన్స్ సిఆర్ డిఎ కమిషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం ఎంపిడిఓ శంబంగి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ వీడియో కాన్ఫరెన్సులో భాగంగా సిబ్బందికి దరఖాస్తు చేసుకున్న ప్రతి వేతనదారునికి జాబు కార్డ్ అందేలా చూడాలని శ్రమశక్తి సభ్యులకు సంఘాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పనులు జరిగేటప్పుడు పర్యవేక్షించే విధానం వేతనదారులు పనిచేసిన అనంతరం వాటి యొక్క కొలతలు నమోదు ప్రక్రియ పని కోసం దరఖాస్తు చేసుకునే వారి నుండి డిమాండ్ తీసుకోవాలని ప్రతిరోజు మస్టర్ లో హాజరు ఆన్లైన్ ద్వారా పంపించాలని పనులను జియో ట్యాగింగ్ చేయాలని పని పెట్టే ప్రదేశంలో క్షేత్ర సహాయకులు ప్రధమ చికిత్స కిట్ లను లబ్దిదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో కలిసెట్టి శ్రీనివాసరావు టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి హామీ క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు

సంక్రాంతి సంబరాలలో పాల్గొని ప్రతిభ కనబరచండి

ఈ నెల 10న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ విజయభారతి

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10న సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందని ఆ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం.విజయభారతి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలలో రంగవల్లులు, సాంప్రదాయ వస్త్రాలంకరణ, నృత్య పోటీలు, త్రాడు లాగుట, మ్యూజికల్ చైర్, పాటల పోటీలు నిర్వహించబడునని, ఈ పోటీలలో గ్రామానికి చెందిన స్త్రీ, పురుషులందరూ పాల్గొని తమ ప్రతిభ కనబరచాలని ఆమె కోరారు. ముఖ్యంగా రంగవల్లిక పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 1500 రూపాయలు, ద్వితీయ బహుమతి 1000 రూపాయలు, తృతీయ బహుమతి 500 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. గ్రామస్తులు యావన్మంది. ఈ సంబరాలలో పాల్గొని విజేతలుగా నిలిచి బహుమతులు సొంతం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సులు

విశాలాంధ్ర-మోతుగూడెం : చింతూరు తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు మంగళవారం గూడూరు గ్రామ పంచాయతీకి చెందిన గూడూరు, దేవరపల్లి, కొత్తపల్లి గ్రామ పంచాయతికి చెందిన కొత్తపల్లి గ్రామములలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ గ్రామ సభకు గూడూరు గ్రామ సర్పంచ్, మడివి బొజ్జి, ఎంపీటీసీ.సున్నం గౌరమ్మ కొత్తపల్లి గ్రామ సర్పంచ్ సోడే తిరుపతమ్మ, మాజీ సర్పంచ్ కరణం లక్ష్మయ్య,తహసీల్దార్ యస్.చిరంజీవిబాబు, గ్రామ రెవిన్యూ అధికారులు కె.రాజయ్య, ఏ. నాగరాజు గ్రామ సర్వేయర్లు ఎమ్ భద్రయ్య, వి.ఆర్.ఏ సుబ్బారావు, డిఎ గౌతమ్, బలరాం సుబ్బారావు, డబ్ల్యూ.ఎ.బి. నారాయణ, ఒప్తాలమిక్ మెడికల్ ఆఫీసర్ కిషోర్‌కుమార్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ రేసు కృష్ణకుమారి, గ్రామపటేల్ డి.శంఖర్ గ్రామ సభలకు సర్పంచ్ హాజరయ్యారు. ఈ సదస్సులో భూమి సంబంధిత సమస్యల అనగా, ఆన్లైన్ నమోదు కొరకు, పట్టా మార్పుల కొరకు, భూమి సర్వే కొరకు, విస్తీర్ణం తప్పులు, కొత్తగా పాస్ పుస్తకం కొరకు దరఖాస్తులు స్వీకరించారు.రెవిన్యూ దరఖాస్తులు. 10 స్వీకరించారు. మెడికల్ సంబంధించి 16 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆయుర్వేద వైద్యులు ఇంటి నిర్మాణ సామాగ్రి వితరణ

విశాలాంధ్ర-ఎటపాక : ఎటపాక మండలంలోని శ్రీనగర్ కాలనీ దమ్మక్కపేట కు చెందిన కొండారెడ్డి సూత్రు వెంకట రామారావు నివాసం అగ్ని ప్రమాదానికి గురై ఒకటవ తేదీన కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేని కారణంగా ఇంటి సామాగ్రి తో పాటు వంట సామాగ్రి బట్టలు విలువైన వస్తువులు మొత్తంగా నాలుగు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. మంగళవారం కుటుంబాన్ని ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ చైర్మన్ జమాల్ ఖాన్ సందర్శించి 20వేల రూపాయల విలువచేసే ఇనుప పైపులను సిమెంట్ రేకులను అందజేయడం జరిగింది. ఘటన జరిగిన రోజు 5000 రూపాయలు కూడా ఆయన బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ సేవలను కొనియాడితూ మండల వైస్ ఎంపీపీ దొంతుమంగేశ్వరరావు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా జామాల్ ఖాన్ ప్రభుత్వం కంటే ముందుగానే స్పందించి బాధ్యత కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడంలో ముందున్నారని ఆయన సేవలో మరింత ప్రజలకు ఉపయోగపడేలా మునుముందుకు కొనసాగాలని ఈ సందర్భంగా తెలియజేశారు. స్థానికులు బాధిత కుటుంబీకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపినారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నాయకులు కనితి మధు, నల్లజాల మధు .. మండలాధ్యక్షులు పొట్టి రమేష్, సోడి నాగమణి, ఎస్కే రసూల్, రామూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది గులి రాగి క్షేత్రం ఏర్పాటు

విశాలాంధ్ర-పాచిపెంట : సాధారణ రైతు వారి పద్ధతి కంటే గులి పద్ధతిలో చోడి పంట నాటుకుంటే సాధారణం కంటే దిగుబడులు రెట్టింపు అవుతాయని వ్యవసాయ అధికారి కే తిరుపతి రావు అన్నారు. కేసలి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ గత సంవత్సరం కేసలి గ్రామంలోనే గుళి పద్ధతిలో చోడి వంట ప్రదర్శన శాతం ఏర్పాటు చేయబడిందని ఈ సంవత్సరం మీసాల మోహన్ రావు అనే రైతు తో పాటు ఐదుగురు రైతులు గుళి పద్ధతిలో చోడి పంటను పండించడానికి ముందుకు వచ్చారని తెలిపారు.గులిచోడి పద్ధతి ముందుగా ఎత్తయిన నారుమడిని తయారు చేసుకుని ఎకరానికి అరకిలో చోడి విత్తనాన్ని పలుచగా నారు పోసుకోవాలని 15 రోజుల ఉన్న నారును అడుగున్నర దూరంలో ఒక్కొక్క మొన నాటినట్లయితే సుమారు 40 కి పైగా పిలకలు వచ్చి అత్యధిక దిగుబడి పొందవచ్చని 20 రోజులకు ఒకసారి 40 రోజులకు ఇంకొకసారి ఒక చెక్కను పంటపై లాగాలని మొక్కలలో కణజాలం లో కదలిక జరిగి అధిక పిలకలు వస్తాయని తెలిపారు ప్రకృతి సేద్య పద్ధతిలో పండించదలచిన రైతులు ప్రతి 15 రోజులకు ఒకసారి ఎకరానికి 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని నాలుగు లేదా ఐదు సార్లు పారించుకోవాలని అవసరాన్ని బట్టి కషాయాలు పిచికారీ చేసుకోవాలని తెలిపారు ఈ పద్ధతి పై శిక్షణ కావలసిన రైతులు వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు రైతులతో కలిసి 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని తయారు చేశారు ఈ కార్యక్రమంలో సీఆర్పీలు తిరుపతి నాయుడు ఎల్ టు సురేష్ విజయ్ నరసింహమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి : డాక్టర్ శ్రుతి

విశాలాంధ్ర-కురుపాం : వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండి అవగాహన తప్పనిసరిగా ఉండాలని వైద్య అధికారి డాక్టర్ శ్రుతి అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సెట్విజ్ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ మరియు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత ఉంటే, ఏకాగ్రత వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయనీ తద్వారా ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్ చాల ముఖ్యం అన్నారు. విద్యార్థి దశ నుండే చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి లక్షణాలను అలవాటు పరుచుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎ వి రవణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామ గోవిందం, యస్ సొసైటీ కార్యదర్శి షేక్. గౌస్, ఉపాధ్యాయుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్ పోస్టుల నియామకం పారదర్శకంగా జరపాలి

విశాలాంధ్ర-బెలగాం : డీలర్ పోస్టుల నియామకం పారదర్శకంగా జరపాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేసారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ సిఫారసుకు అవకాశం లేకుండా నిర్దేశించిన విద్యార్హత, రాత పరీక్షలో మార్కులు ఆధారంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేసారు. ఎంతోమంది పేద అభ్యర్థులు, రాజకీయ, అర్ధబలం లేని అభ్యర్థులు దరఖాస్తులు చేసి ఉన్నారని అటువంటి వారికి అన్యాయం జరగకుండా చూడాలని ఆయన అన్నారు.

మాంస వ్యర్థాలను వేలం పాటదారునికి అప్పగించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని మాంస వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులు వారి అమ్మకాల ద్వారా వస్తున్న మాంస వ్యర్థాలను సంబంధిత కాంట్రాక్టర్ కి అప్పగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తెలిపారు.పురపాలక సంఘ పరిధిలో గల బల్వేస్ట్ అనగా కోడి మాంసం, మేక మాంసం, చేపలు మొదలగు షాపుల నుండి వచ్చిన వ్యర్థాలను తరలించుటకుగాను మున్సిపల్ నిబందనల ప్రకారం చల్లా శంకరరావు, బగ్గందొరవలస వారు వేలంపాట కైవసం చేసుకొన్నందున పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో గల కోడి మాంసం, మేక మాంసం, చేపలు మొదలగు షాపుల నుండి వచ్చిన వ్యర్థాలను వారికి సదరు షాపుయజమానుదారులు అందచేయాలని తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు భారీగా వచ్చిన ప్రజలు

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మండల కేంద్రమైన రాజవొమ్మంగి పంచాయితీ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ అల్లు సత్యనారాయణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజవొమ్మంగి పంచాయితీ ప్రజలు తమ భూ సమస్యలు అధికారులకు తెలిపేందుకు భారీగా తరలివచ్చారు, వారసత్వ భూమి పంపకాలు,చనిపోయిన పట్టాదారుడి పేరు మార్పు, తమ భూమి సరిహద్దులు తెలపాలంటూ, దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపూడి రమణి, మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎంపివిపై ఆందోళన వద్దు

విశాలాంధ్ర-బెలగాం : చైనాలో గుర్తించిన మరో కొత్త వైరస్ హెచ్ఎంపివి (హ్యూమన్ మెటా న్యూమో వైరస్) కేసులు మన రాష్ట్రంలో ఎక్కడా లేవని, ఈ వైరస్ కారణంగా ప్రజలెవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న వైద్యాధికారులందరూ దీనిపై అప్రమత్తంగా వుండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స చేసి సమాచారం యివ్వాలని ఆదేశించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వైరస్ ప్రభావం ఉంటుందని, ఇది సాధారణ ఫ్లూ/జలుబు లాంటిదేనని, వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వలన వెలువడే తుంపరల ద్వారా, వారితో సన్నిహితంగా మెలగడం, కరచాలనం, స్పర్శ వంటి చర్యలతో ఈ వైరస్ వ్యాపిస్తుందని పేర్కొన్నారు. వైరస్ సోకిన తర్వాత 3 నుండి 10 రోజుల్లో బయట పడతాయని తెలిపారు. 20 సెకండ్ల పాటు.నీటితో తరచూ చేతులను కడుక్కోవాలని, దగ్గు, తుమ్మినప్పుడు చేతి రుమాలుతో అడ్డు పెట్టుకోవాలని అన్నారు. వైరస్ సోకినట్లు అనుమానం వున్నవారు వైద్యులు సలహా మేరకు మందులు వాడాలని సొంత వైద్యం చేసుకోవద్దని కోరారు.

అక్రమ విద్యుత్ తీగలకు గిరిజనుడు మృతి

విశాలాంధ్ర-వై.రామవరం : అల్లూరి జిల్లా వై.రామవరం మండలం ఎగువ ప్రాంతం దారగడ్డ లో అడవిపందులకు వేటగాళ్ల అమర్చిన అక్రమ విద్యుత్ తీగలు కు గిరిజనుడు మృతి చెందాడు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దారగడ్డ పంచాయితీ బురద వలస కు చెందిన కడబాల శంభు రెడ్డి(40) సోమవారం రాత్రి దుంపవలస జలపాతం సమీపంలో వేటగాళు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందగా మరొక గిరిజనుడు గాయపడ్డారని అతడిని గుర్తేడు ఆసుపత్రిలో చేర్చినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, నిందితులను శిక్షించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ శాసుం రాఘవ రావు కోరారు.

సీఆర్డీఏ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో ఉమామహేశ్వరి

విశాలాంధ్ర-కురుపాం : రాష్ట్ర ప్రభుత్వం సిఆర్డీడిఎ ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందికి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతున్నటువంటి శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు జరిగేటప్పుడు పరివేక్షించే విధానం, వాటి కొలతలు నమోదు, నూతన జాబ్‌కార్డు మంజూరు, లబ్ధిదారులకు పని కల్పించే విధానంపై, నాణ్యత ప్రమాణాలు పాటించటం తదితర అంశాలపై ఇస్తున్నశిక్షణ సిబ్బంది సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలో జరిగే పనులు వద్ద అమలుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పి. బావాజీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోని డిడి తీరుపై తల్లిదండ్రులు మండిపాటు

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలోని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు-1లో ప్రభుత్వం అమలు చేస్తున్న మేను ప్రకారంగా పెట్టకుండా, తన సొంత నిర్ణయాలతో మెనూ అమలు చేస్తుండడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిపి ఆందోళన చెపట్టిన విషయం తెలిసిందే. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు-1 వార్డెన్ పాడి పూర్ణ రాజుపై చర్యలు తీసుకోవాలంటూ డిడి రజిని ఫోన్లో జరిగిన విషయాన్ని ఎస్ఎఫ్ఐ నేతలు చెప్పడంతో సోమవారం నేను వచ్చి వార్డెన్ తొలగించి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సోమవారం రాత్రి డిడి ఎవరికి తెలియకుండా పాఠశాలలో వచ్చి తనిఖీలు చేపట్టి డిప్యూటీ వార్డెన్‌పై చర్యలు తీసుకోకుండా పాఠశాల సిబ్బందితో కుమ్మక్కై మంతనాలు జరిపి మరలా అదే వార్డెన్ కొనసాగించడంతో డిడి తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తప్పు చేస్తున్న వార్డెన్‌పైన డిడి వెనకేసి రావడంతో ఆంతర మేమిటో చెప్పాలని రాత్రి జరిగిన విషయాన్ని చూస్తే అర్థమవుతుందని అని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వెంటనే చర్యలు తీసుకుని వార్డెన్ పదవి నుంచి తొలగించి విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరు తున్నారు. ప్రభుత్వమే మెనూ ప్రకారంగా అమలు చేయాలని చెప్తున్నప్పటికీ. పర్యవేక్షణ చేయవలసిన అధికారులు మెనూ అమలుచేయని వార్డెన్‌ను చర్యలు తీసుకోకుండా విధులకు కొనసాగించ డంతో పలు విమర్శనలకు దారితీస్తుంది. డిడి పర్యవేక్షణ లోపల కారణంగానే పాఠశాలలో పౌష్టికాహారం లోపం వలన విద్యార్థి మరణాలు సంభవిస్తున్నాయని దీనికి ఉదాహరణ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సక్రమంగా మెనూ అమలు జరగకపోవడమే నని పలు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పాఠశాల యాజ మాన్యాలపై డిడి వ్యవహరిస్తున్న తీరును ఐటిడిఏ పిఓకి ఉన్నత అధికారుల దృష్టికి ఫిర్యాదు చేస్తామని ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.

వడ్డీలేని పంట రుణాలపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం : వచ్చే ఖరీఫ్ సీజన్‌కు రైతులకు లక్షలోపు వడ్డీ లేని పంట రుణాలు అందించనున్నందున పూర్తి స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంక్ అధికారులు, పలు శాఖల అధికారులతో డిసిసి అండ్ జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ 2024- 25 సంవత్సరానికి రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఖరీఫ్ సీజన్ 2023 సంవత్సరానికి తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించిన రైతుల వివరాలు పోర్టల్‌లో నమోదుచేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం కింద యువత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఊతమివ్వాలని అన్నారు. ప్రధానమంత్రి స్వానిధి, మత్స్యకారుల వీధి వ్యాపారులకు రుణాలు, ముద్రా రుణాలు మంజూరులో కొన్ని బ్యాంక్‌లు వెనుకబడి ఉన్నందున త్వరితగతిన లబ్ధిదారులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంప్లాయిమెంట్ డెవలప్మెంట్ పై యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. బ్యాంక్ ఖాతాదారుల సౌలభ్యంకోసం మొండెంకల్లు వద్ద నూతన బ్రాంచ్ ఏర్పాటుకు అధికారులు ఆలోచనలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందించడం లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంక్ అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్. విజయ్ స్వరూప్, డిసిసిబి బ్యాంక్ సిఈఓ సిహెచ్. ఉమామహేశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి పి. శ్రీరామమూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి తిరుపతయ్య, ఎఎల్ డిఎం కె. మౌనిక, ఇతర బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వారపు సంత

విశాలాంధ్ర-జి.మాడుగుల : సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వారపు సంత, గిరిజనులతో కిక్కిరిసిపోయింది. గ్రామ పెద్దలు మత్స్యరాస రామరాజు నాగరాజు. వెంకట గంగరాజు స్థానిక సర్పంచ్ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి మంగళవారం సంత బయలు గ్రామంలో నిర్వహించే వారపు సంత, సంక్రాంతి సందర్భంగా సంక్రాంతికి ఒక వారం ముందు మండల కేంద్రంలో మత్స్య రాస వెంకటరాజు నిర్వహించడం కొన్ని సంవత్సరాల నుండి ఆనవాయితీగా వస్తుంది అయితే ఈ కొత్త సంతకు గిరిజనులు పండించిన కందులు పసుపు వంటి అటవీ ఉత్పత్తులను, తీసుకొని వచ్చి అమ్మి వచ్చిన డబ్బులతో కుటుంబ సమేతంగా ఆ సంతలో నూతన వస్త్రాలను కొనుగోలు చేస్తారు, అంతేకాకుండా జోరా అంటూ నేస్తపు చుట్టాలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్రాంతి పండుగకు మా ఇంటికి రావాలంటూ మర్యాదపూర్వకంగ ఆహ్వానిస్తుంటారు, ఇటు వ్యాపారస్తులు మైదాన ప్రాంతాలైన నర్సీపట్నం చోడవరం అనకాపల్లి విశాఖపట్నం వడ్డాది నుండి అధిక స్థాయిలో వ్యాపారులు ఇక్కడ గిరిజనులకు కావలసిన పలు రకాల, సామాగ్రి వస్తువులను అమ్మకాలకు తీసుకువస్తుంటారు, అధిక స్థాయిలో అమ్మకాలు కొనుగోలు జరిగినందువలన ఇటు వ్యాపారస్తులు అటు గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు, అంతేకాకుండా ఎటువంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సీఐ బి శ్రీనివాసరావు ఎస్సై షణ్ముఖరావు పోలీస్ సిబ్బంది మహిళ పోలీసులు, ఆధ్వర్యంలో, సంతకు వచ్చిన ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

పి.ఎం.జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ప్రధాన మంత్రి జన్ మన్ కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ వి.సి. హాలు నుండి గృహనిర్మాణాలు, డి.ఆర్.డి.ఏ, నైపుణాభివృద్ధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు వంటి అంశాలపై ఎంపిడి ఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 23,654 గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. 17,382 గృహ నిర్మాణాలు ప్రారంభించారని 6273 గృహాలు నిర్మాణాలు ప్రారంభించవలసి ఉందన్నారు. ప్రతీ రోజు 150 గృహాలు నిర్మాణాలు ప్రారంభించాలని స్పష్టం చేసారు. బ్యాంకు లింకేజీ 47 శాతం మాత్రమే సాధించారని చెప్పారు. అర్హత కలిగి సంఘాలకు బ్యాంకు లింకేజీ అందించాలని సూచించారు. స్త్రీ నిధి చెల్లింపులలో జాప్యం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. రెగ్యులర్ పెన్షన్లను రీవెరిఫికేషన్ చేస్తామని డి.ఆర్.డి.ఏ పిడి చెప్పారు. ఉపాధి హామీ పథకంలో లేబర్ మొబలైజేషన్ పెంచాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఉపాధి పనులు కల్పించడం అలసత్వం ప్రదర్శిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగ మించాలన్నారు. చిన్న పిల్లల ఆధార్ అప్డేషన్ చేయాలని సూచించారు. ఎంపిడి ఓలు స్థానికంగా అందుబాటులో ఉండాలని సూచించారు.

పెద్ద పోలమాంబ అమ్మవారి ప్రధాన ఉత్సవం

విశాలాంధ్ర మక్కువ మన్యం జిల్లా మక్కువ మండలంలో శంబర గ్రామంలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు రాష్ట్ర గిరిజన పండుగగా గుర్తింపు పొందిన శ్రీశ్రీశ్రీ పోలమాంబ అమ్మవారి 2025 సంవత్సరం జాతర మహోత్సవంలో భాగంగా శ్రీ పెద్ద పోలమాంబ అమ్మవారి ప్రధాన ఉత్సవం ఈరోజు జరిగినది. ముందుగా శ్రీ పెద్దమ్మ వారి ఘటాలకు బంగారు రంగు పూత తో అలంకరించిరి. తదుపరి ఆలయ రివున్నాయులు,ఆసాధీలు, ఆలయ కార్యనిర్వహణాధికారి, గ్రామ పెద్దలు శ్రీ అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించిరి. తదుపరి ఆలయ ఆశాది కుటుంబీకులు బంగారు పూతతో అలంకరించిన ఘటాలను, పాలదాగరను అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించి ఆలయ సాంప్రదాయ ప్రకారం మంగళ వాయిద్యాలు డప్పు వాయిద్యాలు అమ్మవారి నామ స్వరంతో జయ జయ ద్వానాలు పలుకుతూ ఊరేగింపుగా అమ్మవారి గద్దే వద్దకు తదుపరి ఆలయ రివిన్ నాయులు ఇంటి వద్ద తొలిపూజ చేసిన తదుపరి గ్రామంలోఘటాలుతిరువీధికార్యక్రమం జరుగినది. ఈ కార్యక్రమంలో ఆలయ, గ్రామ పెద్దలు, మాజీ చైర్మన్‌లు, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ, ఎంపీటీసీ శ్రీతీల్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, వసంతల భాస్కరరావు, గంజి కాసినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, గిరడ శ్రీనివాసరావు, అఖ్యాన నర్సింగరావు, పూడి శేఖర్, గోపి గ్రామ పెద్దలు పురప్రజలు వేలాదిమందిగా పాల్గొని అమ్మవారు ఆశీస్సులు పొంది తరించారు. గ్రామంలో తిరువీధి కార్యక్రమం సందర్భంగా ప్రతి ఇంటి వారు అమ్మవారికి పసుపు కుంకుమ ప్రసాదం సమర్పించారు.

సీలింగ్ భూములు బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో గల భీంపోల్ పంచాయతీ సరియా పల్లి గ్రామంలో ప్రభుత్వం సీలింగ్ ల్యాండ్ లో బోర్డులను రెవెన్యూ శాఖ మంగళవారం ఏర్పాటు చేసింది ఈ భూమిలో యంత్రాలు పెట్టి చదును చేస్తున్నారని సిపిఎం నాయకులు జేష్ట వెంకటరమణ ఆరోపించడం తో భూమిపై ఉన్న గిరిజనులకు ఆయనకు మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రామచంద్ర పురానికి చెందిన నలుగురిపై ఫిర్యాదు చేయగా రామచంద్రపురం గ్రామానికి చెందిన మహిళ తనను సిపిఎం నాయకుడు గాయపరిచాడని స్టేషన్లో ఫిర్యాదు చేశారు దీనిపై ఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తూ ఉండగా కొట్లాటకు దారి తీసిన భూమిని తాసిల్దార్ మాణిక్యం రెవెన్యూ సిబ్బంది మంగళవారం పరిశీలించి సీలింగ్ ల్యాండ్ గా గుర్తించి బోర్డులను ఏర్పాటు చేశారు 66 సర్వే నెంబర్లు సుమారు 13 ఎకరాలు ప్రభుత్వ భూమి అని తెలుపుతూ ఈ బోర్డును ఏర్పాటు చేశారు మరోవైపు ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టిన విషయంలో దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని జడ్పిటిసి గంగరాజు ఆధ్వర్యంలో అనంతగిరిలో సిపిఎం నాయకులు ఆందోళన చేశారు మరోవైపు మహిళ పై దాడి చేసిన సిపిఎం నాయకుడిని అరెస్టు చేయాలని రామచంద్రపురం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేస్తున్నారు దీనిపై పోలీసులు విచరణ చేస్తున్నారు.

సబ్ ప్లాన్ మండలాల్లో మౌలిక వసతులు పక్కాగా అమలుకావాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల ఎనిమిది సబ్ ప్లాన్ మండలాల్లో మౌలిక వసతులు కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పక్కాగా అమలుకావాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అసుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మంగళవారం సబ్ ప్లాన్ మండలాలకు చెందిన వివిధ శాఖాధిపతులతో పీఓ ఆయన ఛాంబరులో సమీక్షించారు. ఈ సందర్భంగా సబ్ ప్లాన్ మండలాల్లో ప్రగతికి సంబంధించి రోడ్ల నిర్మాణం, విడివికేల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, వసతి గృహాలు, పాఠశాలల యొక్క మౌలిక సదుపాయాలు గురించి అడిగి విద్యార్థులకు వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వారంలో ఏఎన్ఎంలు రెండు పర్యాయాలు పాఠశాలలను సందర్శించాలని ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిని పీఓ ఆదేశించారు. విద్యుత్ , వ్యవసాయం, ఉద్యానవన పంటలు, వీడివీకేల నిర్వహణ మరియు తదితర అంశాలపై .అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్య, పంచాయితీ రాజ్, వెలుగు, విద్య ఉపాధిహామీ, వాటర్ షెడ్, వ్యవసాయ, ఉద్యానవన, జిసిసి తదితర శాఖలకు సంబంధించిన ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఎస్సై ఉక్కుపాదం

విశాలాంధ్ర-వీరఘట్టం : అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతున్నట్లు ఎస్సై జి కళాధర్ పేర్కొన్నారు. మంగళవారం వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామ పరిధిలో పొట్టేల పందేలపై ఆకస్మికంగా తమ సిబ్బందితో దాడులు జరిపి పట్టుకున్నారు పట్టుబడిన వారిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు వారితోపాటు పొట్టేలు నగదు 3వేల 20 రూపాయలు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు,ఈ సందర్భంగా ఎస్సై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రానున్న సంక్రాంతి పర్వదినాల సందర్భంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎవరైనా చేసినట్లయితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అక్రమంగా నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు వీరఘట్టం మండల పరిధి వండువ గ్రామ సమీపంలో ఓ వ్యక్తి నుండి 20 లీటర్ల నాటు సారా అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ జి కళాధర్ తెలిపారు పట్టుబడిన వ్యక్తి నుండి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచగా రిమాండ్కు తరలించారు అని వెల్లడించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు డ్రైవ్ వేగవంతం

విశాలాంధ్ర-పెదబయలు : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి సీతారామరాజు జిల్లా శాఖ అధ్యక్షులు, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ బృందం సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు బృందం పెదబయలు మండలంలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ అధ్యాపకులతో సమావేశమై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం నమోదుపై అవగాహన కల్పించి దరఖాస్తులను అందజేశారు. అలాగే విద్యార్థిని విద్యార్థులకు సమాజంపై, అవగాహన కల్పించి భవిష్యత్ కార్యాచరణ ఆరోగ్య సూత్రాలను వివరించారు. మండలంలోని తురకలవలస, అరడకోట, పెదబయలు బాలుర -1 బాలుర -2 జిల్లా పరిషత్ పాఠశాల, బాలికల -1 కేజీబివి పాఠశాలలను సందర్శించి రెడ్ క్రాస్ కార్యాచరణ ను వివరించారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి పి సూర్యరావు, సభ్యులు టీ ప్రసాద్ నాయకుడు, జిల్లా కోఆర్డినేటర్ వి లోహితస్ తదితరులు పాల్గొన్నారు.

బోటు పాయింట్ వద్ద పర్యాటకులకు సౌకర్యాల కొరత

చెక్ పోస్ట్ సిబ్బంది చేతివాటం?... చర్యలు చేపట్టాలని పర్యాటకుల విజ్ఞప్తి

విశాలాంధ్ర-దేవీపట్నం : ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు పాపికొండల అందాలను గోదావరి నదిపై విహారం అంటే తెలుగు ప్రజలు చెవి కోసుకుంటారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో కనుమరుగయ్యే పాపికొండల ప్రకృతి సోయగాలను ఒక్కసారైన వీక్షించాలని పర్యాటక ప్రియులు తహ తహ లాడటం పరిపాటి. దానికోసం వేలాది రూపాయలు వెచ్చించి సుదూర ప్రాంతాల నుంచి వస్తారు. తూర్పు ఏజన్సీ గోదావరి ఒడ్డు గండి పోచమ్మ ఆలయం నుంచి రోజూ పర్యాటకుల రాకపోకలు బట్టి ఐదారు బోట్లు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఎక్కడో దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు బోటు పాయింట్ వద్ద సరైన సౌకర్యాలు (వాష్ రూమ్‌లు) ఇతరత్రాలు లేక నానావస్థలు పడుతున్నారు. ప్రభుత్వం బోటు నిర్వాహకులు నుంచి వివిధ రూపాల్లో వేలాది రూపాయలు వసూలు చేయటమే కాకుండా తనిఖీలు పేరుతో చెక్ పోస్ట్ వద్ద ఒక్కొక్క పర్యాటకుని నుంచి రూ.100 వసూలు చేస్తున్న పర్యాటకుల బాగోగులు పట్టించుకొనే నాథుడే లేకపోయారని పర్యాటకులు టూరిజం నిర్వాహకులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులు క్రితం పాపికొండల పర్యాటకం కోసం కుటుంబ సమేతం వచ్చిన సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ ఒకరు ఇదే విషయాన్ని అక్కడ బోటు నిర్వాహకులను నిలదీసినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా పర్యాటక బోటు అన్నింటిని గత ప్రభుత్వ పెద్దలు పేరు చెప్పి నిబంధనలు అతిక్రమించి ఓ బోటు తిప్పుతున్న ఆ బోటు కు అధికారులు ఇచ్చే వెసులుబాటు తమకు ఇవ్వటం లేదని మిగిలిన బోటు నిర్వాహకులు ప్రెస్ మీట్ పెట్టి మరీ తమ ఇబ్బందులు ఏకరువు పెట్టడం నిబంధనలు కు విరుద్ధం గా ఏదో జరుగుతుందనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైనా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అరకులోయ రైల్వే రిక్వెస్ట్ స్టేజ్ వద్ద పాసింజర్ రైళ్లు ఆపాలి

విశాలాంధ్ర-అరకులోయ : అరకులోయ రైల్వే రిక్వెస్ట్ స్టేజ్ వద్ద పాసెంజరు రైళ్లను నిలపాలని జిల్లాకలెక్టర్‌కు అరకులోయ పట్టణ వాసులు, ఆటోకార్మికులు వినతిపత్రాన్ని అందజేసారు. రైల్వే రిక్వెస్ స్టాపై ఆధారపడి వందలాది మంది ఆటో కార్మికులు జీవిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్‌ను ఎం.పిని కలిసి వినతిపత్రాలు అందజేసారు. వాస్తవానికి ఎండపల్లి వలస రైల్వే స్టేషన్ వరకు ప్రయాణించి తిరిగి అరకులోయ రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అరకు లోయ లేనే ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాలు ఉన్నందున రైల్వే రికెస్టు స్టేజ్ వద్ద రైళ్లను నిలుపుల చేయాలని కోరారు. విశాఖ పార్లమెంటు సభ్యురాలు ఉమా గజపతి రాజు ఎం.పి.గా ఉన్న సమయంలో అరకులోయ పట్టణంలో రైల్వే రిక్వెస్ట్ స్టేజ్‌ను ప్రజల, పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేయించారు. నాటి నుండి 2024 డిసెంబరు 31 వరకు కొనసాగించారు. 2025 జనవరి 1 నుండి పాసెంజరు రైలును రిక్వెస్ట్ స్టేజ్ వద్ద నిలుపుదల చేయకోవడంతో ప్రయాణికులు, గిరిజనులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో మాదిరిగా అరకు రైల్వే రిక్వెస్ట్ స్టేజి వద్ద పాసెంజరు రైళ్లను ఆపే విధంగా చర్యలు చేపట్టాలని లిఖిత పూర్వకంగా వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్, అరకు పార్లమెంటు సభ్యురాలు గుమ్మా తనూజా రాణికి కోరారు. అదే విధంగా రైల్వే రిక్వెస్ట్ స్టేజి వద్ద ప్లాట్ పారం, ఫ్లై ఓవర్ వంతెనను నిర్మించాలని విజ్ఞప్తి చేసారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్మికులు రమేష్, చిన్న, ఎల్లారావు, భాషా, వసంత్, కృష్ణరాజు, శ్రీను, శంకర్, రామన్న, స్థానిక గిరిజనులు తదితరులు పాల్గొనరు.

గిరి గ్రామాలలో సేంద్రియ సాగు విస్తరణకు కృషి చేయండి

నైపుణ్య శిక్షణ పొందిన గ్రామీణ యువతకు సూచించిన మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చింతపల్లి : గిరి గ్రామాలలో సేంద్రియ సాగు విస్తరణకు గ్రామీణ యువత సహకరించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. నైపుణ్య శిక్షణ పొందుతున్న గ్రామీణ యువతతో మంగళవారం ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ, ప్రకృతి మీ వ్యవసాయంపై నైపుణ్య శిక్షణ తరగతులలో పొందిన అవగాహనను గ్రామాలలో గిరిజన రైతాంగానికి సూచించి సేంద్రీయ సాగు చేపట్టి వ్యవసాయ ఉత్పత్తులలో అధిక దిగుబడిని సాధించే విధంగా కృషి చేయాలన్నారు. సేంద్రీయ సాగు చేయడం వలన భూమి సారవంతం అవుతుందని, అటువంటి భూమిలో పండిన ఉత్పత్తులను భుజించడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఇటువంటి విషయాలను రైతులకు వివరించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామీణ యువత పాల్గొన్నారు.

ఉత్సాహభరిత వాతావరణంలో 'పిక్నిక్'



విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ వసతి గృహంలో మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో "పిక్నిక్" సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ వసతి గృహ అధికారిని పి నూక రత్నం, ప్రధానోపాధ్యాయుడు కొండలరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పిక్నిక్ కార్యక్రమంలో ఉపాధ్యాయునిలు, విద్యార్థినిలు సాంప్రదాయ నూతన వస్త్రాలంకరణతో సందడి చేశారు. ఈ సందర్భంగా గిరిజన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వందలాదిగా ఉన్న విద్యార్థినిలతోపాటు అతిధులతో వనభోజన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వసతిగృహ అధికారిని నూకరత్నం ప్రధానోపాధ్యాయుడు కొండలరావు లు మాట్లాడుతూ ఏడాదికోమారు నిర్వహించుకునే పిక్నిక్ అటు విద్యార్థులలోనే గాక, ఇటు ఉపాధ్యాయులలోనూ నూతన వరవడిని, ఉత్సాహాన్ని కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునిలు, అధికసంఖ్యలో విద్యార్థినిలు, అతిదులు పాల్గొన్నారు.

చట్రాపల్లి బాధితులను పరామర్శించిన ఏపీటీఎఫ్ బృందం



విశాలాంధ్ర-జీకే వీధి : గత ఏడాది తుఫాను కారణంగా కొండ చరియలు విరిగిపడిన ఘటనలో నష్టపోయిన గూడెం కొత్త వీధి మండలంలో వివిధ గ్రామాల పాఠశాలలో చట్రపల్లి , మాదికమల్లు, నిమ్మచెట్టు, దారకొండ, గిరిజన గ్రామాలను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ బృందం సందర్శించింది. రాష్ట్ర నాయకత్వంలో బృందంతో వివిధ గ్రామాల పరిధిలో పాఠశాలలను మౌలిక వసతులను పరిశీలించడం జరిగిందినీ ఏపీ టి ఎఫ్ కార్యదర్శి శ్రీనివాసరావు, ఏఎస్ ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, ఏపీటీఎఫ్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కె పెద్దబ్బాయి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థులకు కొండ చారియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబాల మౌలిక వసతులు స్థితిగతులను పరిశీలించి తెలుసుకోనీ. వరద బాధిత కుటుంబాలకు ఉపాధ్యాయ సంఘాల బృందం పరామర్శించడం జరిగిందన్నారు. విద్యార్థి విద్యార్థులకు పెన్నులు, అట్ట, దుప్పటి జంబుకం తో కిట్టు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర శ్రీనివాసులు, ఎ ఎస్ ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, జీకే వీధి ఏపీటీఎఫ్ కీట్లాంగి పెద్దబ్బాయి, ధారబాబు కామేశ్వరరావు రెడ్డి వెంకటేశ్వర్లు కె చిరంజీవి పి బాలయ్య ఎస్ లక్ష్మణరావు నారాయణ తదితరులు పాల్గొన్నారు.